RNI Regd No. 06225/99

## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | సీక్రెట్ డాక్ట్రిన్ ఉపన్యాసాలు - 3 భాగాలు | 750.00 |
| 2. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 320.00 |
| 3. | పరివ్రాజకుల కరదీపిక | 180.00 |
| 4. | నవయుగ సాహిత్యము | 180.00 |
| 5. | నవ్యయుగావతరణకు ఏకాదశ పుష్పాలు | 140.00 |
| 6. | సూర్యకిరణ విజ్ఞానము | 110.00 |
| 7. | ఆహార విజ్ఞానము | 110.00 |
| 8. | వేదమయ జీవనము | 90.00 |
| 9. | రహస్య జ్యోతిర్విద్య | 60.00 |
| 10. | గహనా కర్మణో గతిః | 50.00 |
| 11. | ప్రాక్టికల్ థియాసఫీ | 50.00 |
| 12. | అనుగ్రహ మాలామంత్రము | 30.00 |
| 13. | టైమ్ మేనేజ్‌మెంట్ | 25.00 |
| 14. | విశిష్ట యోగసాధనలు - 1 | 25.00 |
| 15. | త్రిముఖీ గాయత్రీమాత ధ్యానవిధానము | 25.00 |
| 16. | శ్రీసూక్తము | 20.00 |

**ప్రతులకు :**

| | | |
|---|---|---|
| ✧ గురు సీతారామ్ | భీమవరం | 90106 47325 |
| ✧ శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె | 90309 80315 |
| ✧ శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం | 98858 74477 |

భూమి స్వర్గముగా మారటానికి
మానవజాతి సాధించవలసిన
5 లక్ష్యాలు

ఒకే శక్తి - సూర్యకిరణాల శక్తి
ఒకే ధర్మము - దేహములే దేవాలయాలు
ఒకే విశ్వము - ఎల్లలు లేని యుద్ధాలు లేని ప్రపంచము
ఒకే భాష - ప్రేమ, మౌనము
ఒకే కరెన్సీ - ఒకే వినిమయ సాధనము

# స్వర్ణయుగము

నూతన యుగపు మాసపత్రిక



ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా (భగీ. 18-61)

ఓ అర్జునా! ఈశ్వరుడు సమస్త ప్రాణుల యొక్క హృదయమునందే నివశిస్తూ, వారి వారి కర్మానుసారము వారిని యంత్రముల వలె త్రిప్పుచున్నాడు

రూ. 20.00 ఏప్రిల్ 2014 (100)

## విషయ సూచిక


- అంతర్వాణి సాధనా తరగతులు 4
- బలరామ, సుభద్రా సహిత జగన్నాయకులు (వరల్డ్ లీడర్స్) గా మారండి 8
- తెలుగు ప్రజలు విభజింపబడుతూ ఉంటే, రష్యన్ ప్రజలు మళ్ళీ సమైక్యమయ్యారు 12
- భూమి స్వర్గంగా మారాలి అంటే స్కూళ్ళు, కాలేజీలు, బ్యాంకులు పోవాలి 18
- సిరియా విషయంలో కూడా అమెరికాకు భంగపాటు తప్పలేదు 22



సంపుటి - 9 సంచిక - 4

స్వర్ణయుగము మాసపత్రిక

సంవత్సర చందా : రూ. 240.00

ఆంధ్రా బ్యాంక్ ఆన్‌లైన్ ఎకౌంట్ నెం.
00461 00110 20050
IFSC Code : ANDB 0000046

చందా పంపించవలసిన చిరునామా :

పి. సీతారాముడు
అఖండ గురుసత్తా యోగవిద్యా కేంద్రము
7-1-4/2, ఓవర్ బ్రిడ్జ్ ప్రక్కన,
భీమవరం - 534 201, ప.గో. జిల్లా.
ఫోన్ నెం. : 90106 47325
78421 33860

Printed and Published by P. Sita Ramudu and Printed at Akhanda Gurusatta Printers, Bhimavarm and Published at 7-1-4/2, N. Agraharam, Bhimavaram, W.G. Dt., A.P.
Editor : P. Sita Ramudu







ఈ దిగువ పరిజనుల భాగస్వామ్యముతో ఈ సంచిక వెలువడినది

| | |
|---|---|
| శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె |
| శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం |
| శ్రీ వి.ఎస్.పి. గుప్త | విశాఖపట్నం |
| శ్రీ ఎస్.పి. సురేష్ కుమార్ | పుణె |
| శ్రీమతి జి. జయప్రద | హైదరాబాద్ |
| శ్రీ ఎమ్. రంగరాజు | భీమవరం |

పై పరిజనులు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు

గురు సీతారామ్

# అఖండ గురుసత్తా యోగవిద్యా కేంద్రము

## అంతర్వాణి సాధనా తరగతులు

పరిజనులకు నమస్కారము!

1994 మే నెల 1 నుండి 21 వరకు అమలాపురంలో జరిగిన "ఋషికల్ప సాధనా శిబిరము"లో తొలిసారిగా నాకు మాస్టరుగారి దర్శన భాగ్యం కలిగింది.

అప్పట్లో నంబూరు స్కూలులో టీచర్‌గా పనిచేస్తున్న రమణ కుమారి గారు, చీరాల హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోన్న సీతగారి ద్వారా నేను మాస్టరు గారిని కలవగలిగాను.

ఆ 21 రోజుల సాధనా శిబిరములో మొదట 3 రోజులు, ఆ తరువాత 7 రోజులు నేను మాస్టరుగారి సమక్షంలో గడపగలిగాను.

ఆ తరువాత నా జీవితం యొక్క దిశ పూర్తిగా మారిపోయింది.

1995, 1996 సంవత్సరాలలో మాస్టరుగారు భీమవరం రావడం.

మాస్టరుగారి సూచనతో 1996 లో భీమవరానికి మా మకాం మార్చడం.

1997 లో స్వర్ణయుగము మాసపత్రికను ప్రారంభించడం,

1998 లో విశ్వకర్మ పబ్లికేషన్‌ని ప్రారంభించడం,

1999 లో గుంటూరుకు మా మకాంని మార్చడం,



2000 లో హైదరాబాద్‌లో కొంత కాలం గడపటం,

2001 లో మాస్టరుగారు "ప్రజ్ఞాపుత్రుడు" గా నాకు దీక్షను ఇవ్వటం,

ఆ తదుపరి పరిజనుల యొక్క సహకారంతో మాస్టరుగారి ఉపన్యాసాలను అనేక పుస్తకాలుగా ప్రచురించడం జరిగింది.

1997 లో ప్రారంభించబడిన స్వర్ణయుగము మాసపత్రిక మధ్యలో రెండు సార్లు నిలిపివేయబడింది.

2006 పునః ప్రారంభించబడిన తరువాత, మాస్టరుగారి అనుగ్రహంతో, పరిజనుల సహకారంతో పత్రిక ప్రస్తుతం నిరాటంకంగా కొనసాగుతోంది.

2010 ఏప్రిల్‌లో మా నివాసాన్ని మా స్వగ్రామం అయిన కోమటిగుంట గ్రామానికి మార్చిన తరువాత, మే 3 వ తారీఖున మాస్టరుగారిని హైదరాబాద్‌లోని విజయావిశ్వనాథ్‌గారి నివాసంలో కలవడం జరిగింది.

ఆ సందర్భంగా మాస్టరుగారు మా పిల్లలు విశ్వనాథ్, తేజస్వినిలతో మాట్లాడుతూ, "మీ నాన్న నాలుగు సంవత్సరాలలో గాంధీ అంత గొప్పవాడు అవుతాడు. మీ నాన్నకు సహాయం చేయండి" అని చెబుతూ,

నా వైపు తిరిగి "నీకు ఎంత టైమ్ ఇస్తున్నాను?" అని అడిగారు.

"నాలుగు సంవత్సరాలు మాస్టారు!" అన్నాను.

2011 ఫిబ్రవరి 11 న మాస్టరుగారిని ఒంగోలులోని శ్వేతద్వీపంలో కలిసినప్పుడు నా మిసెస్ మంగతాయారుతో "మొత్తం ప్రపంచానికి అతను ఒక్కడూ ఎదురుతిరిగాడమ్మా! అతనికి సహాయం చేయండమ్మా!" అంటూ,

"గాబరా పడకండి. మీ పని మీరు చేస్తూవుండండి. టైమ్ వచ్చినప్పుడు నేనే మిమ్మల్ని లేపుతాను" అని మాస్టరుగారు అన్నారు.

మాస్టరుగారు నాకు ఇచ్చిన 4 సంవత్సరాల టైము 2014 మే 3 నాటికి పూర్తవుతోంది. ఈ 4 సంవత్సరాల కాలంలో గాంధీ అంత గొప్పవాడిని అవటానికి నేను చేసిన ఘనకార్యాలు ఏవీ నాకు కనిపించడం లేదు.

స్వర్ణయుగము మాసపత్రికలో చాలా తరచుగా పేర్కొనబడిన విధంగా 2011 అక్టోబరు 28 నాటికి ప్రపంచంలో ఆలోచనా విప్లవం, ఆర్థిక విప్లవం, విద్యా విప్లవం వచ్చివుంటే, బహుశా పత్రిక యొక్క ఆలోచనా విధానం, భావజాలం వలన నేను ఒక ప్రముఖ వ్యక్తిగా గుర్తింపుని పొందివుండేవాడినేమో!

దురదృష్టవశాస్తూ, ఈ మూడు విప్లవాలు సూక్ష్మజగత్తుకే పరిమితం అయి, భౌతిక జగత్తులో వాటి యొక్క బీజారోపణే జరిగింది తప్ప, మానవ సమాజం చాలా స్పష్టంగా గుర్తించే స్థాయిలో ఆ మార్పులు జరుగలేదు.

అందుచేత నేను కూడా గాంధీ అంత గొప్పవాడిని అవటం అనేది సూక్ష్మ జగత్తుకే పరిమితం అవుతుందేమో అని భావిస్తూ,

భౌతిక జగత్తులో అంత గొప్పవాడిని కావడానికి కావలసిన బీజాలను మాస్టరుగారు ఇచ్చిన టైమ్‌లోగా వేసుకోవాలి అనే ఉద్దేశ్యంతో, గత దత్త జయంతి నుండి యోగ శిక్షణా తరగతులను భీమవరంలోని "అఖండ గురుసత్తా యోగ విద్యా కేంద్రం" లో ప్రారంభించాను.

గాంధీగారు "అంతర్వాణి" అనే పదాన్ని చాలా తరచుగా ఉపయోగించే వారు. ఆయన యొక్క జీవితం మొత్తం ఆయన అంతర్వాణి యొక్క ఆదేశాను సారం నడిచేది. అందుకే ఆయన ఆ స్థాయికి ఎదగగలిగారు.

***మనం కూడా గాంధీజీ అంత గొప్పవాళ్ళం అవాలి అంటే,***

ఆ అంతర్వాణిని మనం పట్టుకోగలగాలి.

ఆ జీవిత విధానాన్ని మనం అవగాహన చేసుకోవాలి.



పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య తన చిన్నతనంలో గాంధీజీ అంత గొప్పయోగి కావాలి అనే కోరికతో సబర్మతీ ఆశ్రమంలో 3 నెలలు పాటు గాంధీజీ సమక్షంలో ఉన్నారు.

"ఆ మూడు నెలల కాలంలో నేను పొందిన శిక్షణే నా జీవితంలోని అన్ని విజయాలకు కారణం" అని పూజ్య గురుదేవులు తమ ఆత్మకథలో వ్రాశారు.

మాస్టరుగారు అందజేసిన వివిధ సాధనలు, వివిధ ఉపన్యాసాలు మనల్ని అంతర్యామి ప్రబోధం ప్రకారం జీవించగలిగే విధంగా తీర్చిదిద్దుతాయి.

ఆ యోగ జీవిత విధానం యొక్క ప్రాథమిక శిక్షణ, అవగాహన ఈ "అంతర్వాణి సాధనా తరగతు"లలో ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నాను.

సాధకులు తమ వీలుని బట్టి 3 నుండి 30 రోజులు వరకు ఈ సాధనా తరగతులలో పాల్గొనవచ్చును.

శిక్షణ, ఆహారము, వసతి మొదలైన వాటికి అయ్యే రుసుము వివరాలు ఈ దిగువన తెలియజేస్తున్నాను.

పరిజనులు ఈ ప్రయత్నాన్ని సఫలం చేస్తారు అని భావిస్తున్నాను.

గురు సీతారామ్

ఫోన్ నెం. 90106 47325

***రుసుము వివరాలు :***

| | |
|---|---|
| 3 రోజులకు | రూ. 2,000 |
| 5 రోజులకు | రూ. 3,000 |
| 9 రోజులకు | రూ. 5,000 |
| 15 రోజులకు | రూ. 8,000 |
| 30 రోజులకు | రూ. 15,000 |

# బలరామ, సుభద్రా సహిత జగన్నాయకులు (వరల్డ్ లీడర్స్) గా మారండి

2.3.14 న డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారు
మౌంట్ శంబళాలో ఇచ్చిన ఉపన్యాసం ఆధారంగా

భారతదేశంలోని వేలాది మంది వ్యక్తులు తమ నాయకత్వ పటిమను పరీక్షించుకుంటోన్న కాలం ఇది.

ప్రపంచానికే నాయకత్వం వహించబోతోంది అని చెప్పబడుతోన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఈ నాయకుల పోటీ పరీక్షలు మూడింతలు ఎక్కువగా జరుగుతూ ఉండటం కాకతాళీయం కాదేమో!

దేశం మొత్తం మీద కేవలం లోక్‌సభకు ఎన్నికలు జరుగుతూవుంటే,
ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం స్థానిక సంస్థలకు, శాసన సభ స్థానాలకు, లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి.

బహుశా తెలుగువారికి స్థూల, సూక్ష్మ, కారణ జగత్తులలో పోటీ పరీక్షలు జరుగుతున్నాయేమో!

ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ మొత్తం వివిధ స్థాయిలలోని నాయకుల యొక్క తీవ్రమైన ప్రయత్నం (తపస్సు) తో నిండివుంది.

ప్రతీ నాయకుడు తన యొక్క విజయానికి సామ దాన భేద దండోపాయాలను ఉపయోగిస్తూనే, భగవంతుడి యొక్క అనుగ్రహాన్ని కూడా కోరుకుంటోన్న కాలం ఇది.



వాస్తవానికి రాజకీయ రంగంలోని ఏ వ్యక్తి అయినా, ఏ చిన్న పదవిని చేపట్టడానికి అయినా దైవీ అనుగ్రహం కావలసిందే.

ఒక చిన్న గ్రామ పంచాయితీలోని వార్డు మెంబరుగా ఎన్నిక కావాలి అన్నా, శంబళాలోని "గురు మండలి" యొక్క అంగీకారం ఉండాలి అని మాస్టరు గారు (డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారు) చెబుతారు.

పంచాయితీ బోర్డు వార్డు మెంబరుగానే కాదు, మొత్తం ప్రపంచానికే నాయకత్వం వహించే "వరల్డ్ లీడర్"గా తీర్చిదిద్దే ఒక అవగాహనని మాస్టరుగారు 2.3.14 న మౌంట్ శంబళాలో తెలియజేశారు.

మౌంట్ శంబళాలోని మూడు భారీ సైజు శిలలు బలరామ, సుభద్ర, జగన్నాథులుగా ఉపాసింపబడుతున్నాయి.

ఈ బలరామ, సుభద్ర, జగన్నాథుల ఉపాసన యొక్క అంతరార్థాన్ని వివరిస్తూ, బలరాముడు అంటే నదుల యొక్క దిశను మార్చేవాడు అని అర్థం అని మాస్టరుగారు తెలియజేశారు.

అత్యంత సమర్థవంతులైన రాజకీయ నాయకులకు ఉండే శక్తి ఇది. వాళ్ళు సమాజం ప్రయాణించే దిశను మార్చగలుగుతారు.

వాళ్ళు మంచి వైపు సమాజాన్ని మారుస్తారా,
చెడు వైపు మారుస్తారా అనేది, అది వేరే విషయం.

ఇందిరాగాంధీ ఒకే ఒక దెబ్బతో దేశంలోని బ్యాంకుల్ని జాతీయం చేసేస్తే,
ఎన్టీయార్ ఒకే ఒక పోటుతో మున్సిఫ్, కరణాలను తొలగించారు.

రాజీవ్‌గాంధీ లేకపోతే ఈనాటికీ మన దేశంలోకి కంప్యూటర్స్ వచ్చి వుండేవి కాదు అని మాస్టరుగారు చెబుతారు.

1991 లో అప్పటి ప్రధాని పి.వీ. నరశింహారావు, అప్పటి ఆర్థిక మంత్రి, ప్రస్తుత ప్రధాని మన్‌మోహన్ సింగ్, మాంటెక్ సింగ్ అహ్లువాలియాల త్రయం అప్పటి వరకు మన దేశం అనుసరిస్తోన్న సామ్యవాద తరహా ఆర్థిక విధానాలను పూర్తిగా మార్చివేసి, భారతీయ ఆర్థిక రంగాన్ని అమెరికా తరహా ఆర్థిక విధానాలు వైపు మరలించారు.

ఈ విధంగా సమర్థులైన నాయకులు సమాజం యొక్క దిశను తాము కోరుకున్న దిశలో మరల్చగలుగుతారు.

వాస్తవానికి "బలరాముడు" అనేది ఒక సాంకేతిక పదం అని మాస్టరు గారు ఈ సందర్భంగా తెలియజేశారు.

❀ తన యొక్క శక్తిని 100 శాతం పరిపూర్ణంగా వినియోగించుకునే ఏ వ్యక్తి అయినా సరే అతడు "బలరాముడే".

మనం బలరాముడిలాగా నదుల యొక్క దిశను మార్చలేకపోవచ్చు.
హనుమంతుడిలాగా పర్వతాలను పెకిలించలేకపోవచ్చు.

కానీ మన శక్తిని, మన స్థాయిలో పరిపూర్ణంగా వినియోగించగలిగితే.
మనం బలరాముడిమే.

అందుచేత మనం జగన్నాథుడిగా పరిణతి చెందాలి అంటే,
జగన్నాయకుడిగా పరిణతి చెందాలి అంటే,
వరల్డ్ లీడర్‌గా పరిణతి చెందాలి అంటే,

మన యొక్క కాలాన్ని,
మన యొక్క ప్రతిభను,
మన యొక్క ధనాన్ని పరిపూర్ణంగా వినియోగించుకోగలగాలి.
ఈ మూడింటిని పరిపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలి.



మన యొక్క శక్తిని పరిపూర్ణంగా వినియోగించుకుంటే సరిపోదు.
దానిని సద్వినియోగం చేయాలి.
మంచి కార్యాలకు వినియోగించాలి.

"భద్ర" అంటే మంచి.
"సుభద్ర" అంటే చాలా మంచి.

**ఏవి మంచి కార్యాలు అంటే,**

సమాజానికి ఉపయోగపడేవి మంచి కార్యాలు.

శక్తివంతుడు ఎప్పుడూ శక్తిని తన స్వార్థానికే వినియోగిస్తాడు.

❀ ఆ విధంగా స్వార్థ ప్రయోజనాలకు, స్వంత ప్రయోజనాలు కాకుండా, సమాజం యొక్క ప్రయోజనాలకు తన శక్తిని పరిపూర్ణంగా వినియోగిస్తే, అతడు "జగన్నాథుడు" అవుతాడు.
జగన్నాయకుడు అవుతాడు. వరల్డ్ లీడర్ అవుతాడు.


ఈ బలరామ, సుభద్రా లక్షణాలు ఎవరెవరిలో ఏ మేరకు ఉన్నాయో, దానికి తగినట్టుగా శంబళాలోని గురు మండలి యొక్క అనుగ్రహం వారికి లభించి, రాజకీయరంగంలో వివిధ పదవుల్ని అధిరోహిస్తారు.

అందుచేత రాజకీయ రంగంలో ఎవరైనా బాగా రాణించాలి అనుకుంటే,
భగవంతుని యొక్క కృపతో ఉన్నత పదవుల్ని పొందాలి అనుకుంటే,
పొందిన పదవుల్ని సుస్థిరంగా ఉంచుకోవాలి అంటే,
వాళ్ళ వాళ్ళ అంతరంగాలలో ఈ మార్పుని చేసుకోవాలి.

బలరామ, సుభద్రా సహిత జగన్నాయకులుగా పరిణతి చెందటానికి ప్రయత్నం చేయాలి.

❀✳❀

# తెలుగు ప్రజలు విభజింపబడుతూ ఉంటే, రష్యన్ ప్రజలు మళ్ళీ సమైక్యమయ్యారు



ఒప్పంద పత్రంపై సంతకం చేస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

తెలుగు ప్రజల్ని రెండు రాష్ట్రాలుగా విభజించడానికి ఉద్దేశించిన "ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు"ను 18.2.14 న లోక్‌సభ ఆమోదించింది.


దానికి సరిగ్గా నెల రోజుల తరవాత 18.3.14 న ఉక్రెయిన్ దేశంలోకి బదిలీ చేయబడ్డ రష్యన్ ప్రజలు తిరిగి మళ్ళీ రష్యాలో విలీనం అయ్యారు.

ఏ తెలుగు ప్రజలు అయితే, మొత్తం మానవజాతిని ఒకే కుటుంబంగా మారుస్తారు అని మహాత్ములు తెలియజేస్తున్నారో, ఆ తెలుగు ప్రజలే స్వార్థపూరిత రాజకీయ శక్తులు కారణంగా ప్రస్తుతం రెండుగా విభజింపబడుతున్నారు.

కానీ రష్యన్ ప్రజల్ని అణచివేయడానికి, అనామకుల్ని చేయడానికి అమెరికా, యురోపియన్ దేశాలు ఉక్రెయిన్ దేశంలో ప్రజా ఉద్యమాన్ని ఎగదోస్తే, విచిత్రంగా 1956 నుండి ఉక్రెయిన్ దేశంలో అంతర్భాగంగా ఉంటోన్న క్రిమియా ప్రాంతంలోని రష్యన్లు తిరిగి రష్యాతో సమైక్యం అయ్యారు.

ఈ మొత్తం ఉదంతాన్ని వివరించే శ్రీ పిళ్ళా వేంకటేశ్వరరావుగారి వ్యాసాలు 25.2.14, 18.3.14 నాటి "సాక్షి" దినపత్రికలో వెలువడ్డాయి.








యానుకోవిచ్



తురియనేవ్

రష్యాకు పశ్చిమాన ఉన్న ఉక్రెయిన్ దేశం ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో అంతర్భాగంగా ఉండేది.

1956 లో అప్పటి సోవియట్ ప్రధాని కృశ్చేవ్ రష్యన్ రిపబ్లిక్‌లోని క్రిమియా ప్రాంతాన్ని ఉక్రెయిన్‌కి బదిలీ చేశారు.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం అయిన తరువాత స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన ఉక్రెయిన్‌లో రష్యన్ సంతతికి చెందిన ప్రజలు అత్యధికంగా నివశిస్తోన్న క్రిమియా ద్వీపకల్పం స్వతంత్ర ప్రత్తిపత్తిగల ప్రాంతంగా ఉండేది.

- సోవియట్ యూనియన్ విడిపోయిన తరువాత రష్యాను నిర్వీర్యం చేయడానికి అమెరికా, యురోపియన్ దేశాలు చేస్తోన్న ప్రయత్నాలు కారణంగా "వార్సా" (ఒకప్పటి సోవియట్ యూనియన్ నేతృత్వంలోని కూటమి) కు చెందిన ఏడు దేశాలు, మూడు సోవియట్ రిపబ్లిక్‌లు, అమెరికా నేతృత్వంలోని "నాటో" కూటమిలో భాగం అయ్యాయి.

ఉక్రెయిన్ మాత్రం 2004 వరకు రష్యాకు అనుకూలంగా ఉండేది.

2004 లో అమెరికా, యురోపియన్ యూనియన్ (ఈయూ) "ఆరెంజ్ విప్లవం" పేరుతో ఉక్రెయిన్‌లోని రష్యా అనుకూల ప్రభుత్వాన్ని కూలదోశాయి.

అమెరికా అండదండలతో ఆ విప్లవానికి నేతృత్వం వహించిన "ట్యామె షెంకో" ఆ తదుపరి ఉక్రెయిన్‌కి ప్రధాని అయ్యారు.

2010 లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో పోటి చేసిన అమె, ఇటీవల పదవీచ్యుతుడు అయిన "యానుకోవిచ్" చేతిలో పరాజయం పాలయ్యారు.

ఆ ఎన్నికలు పూర్తి స్వేచ్ఛగా, ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా జరిగాయి అని ఈయూ పరిశీలకులే కితాబు ఇచ్చారు.

అధ్యక్షుడు అయిన తరువాత యానుకోవిచ్, ఉక్రెయిన్‌ని ఈయూలో చేర్చడానికి సిద్ధపడ్డారు. అందుకు ప్రతిగా ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఉక్రెయిన్‌ని గట్టెక్కించడానికి ఆర్థిక సహాయాన్ని అందించవలసినదిగా ఆయన కోరారు.

అమెరికా, ఈయూలు మొండి చేయి చూపడంతో యానుకోవిచ్ రష్యాను ఆశ్రయించాల్సి వచ్చింది.

గత ఏడాది చివర్లో రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్‌కి 1500 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయంతో పాటు, ఉక్రెయిన్‌కి సరఫరా చేస్తున్న సహజ వాయువు ధరను మూడో వంతు మేరకు తగ్గించారు.

దానితో యానుకోవిచ్ రష్యాకు చేరువయ్యారు.

యానుకోవిచ్ రష్యాకు చేరువ అవడాన్ని జీర్ణించుకోలేకపోయిన అమెరికా, ఈయూలు ఆయన్ని నియంతగా అభివర్ణించడం మొదలుపెట్టి, ఉక్రెయిన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాల్ని ఎగదోశాయి.

ఈయూలో చేరతాను అంటే యూనుకోవిచ్ ప్రజాస్వామ్యవాది.



రష్యాకు చేరువ అవడంతో ఆయనే నియంతగా మారిపోయారు.

* ప్రపంచ రాజకీయ రంగంలో పాశ్చాత్యదేశాల యొక్క ద్వంద్వనీతి ఈ విధంగా ఉంటుంది.

ఈ ప్రజా ఉద్యమాలు కారణంగా గత నెలలో యానుకోవిచ్ పదవి నుండి దిగిపోవాల్సి వచ్చింది.

2004 ఆరెంజ్ విప్లవానికి నేతృత్వం వహించిన మాజీ ప్రధాని ట్యామె షెంకోకి నమ్మిన బంటు అయిన అలెగ్జాండర్ తుర్చియనేవ్ ప్రస్తుతం ఉక్రెయిన్‌కి తాత్కాలిక అధ్యక్షుడు అయ్యారు.

ఈ విధంగా అమెరికా, యురోపియన్ యూనియన్‌లు ఉక్రెయిన్‌లో తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాన్ని మళ్ళీ ఏర్పాటుచేశాయి.

శ్రీ ఒక్క ఉక్రెయిన్ విషయంలోనే కాదు, ప్రపంచంలోని ఏ దేశంలో అయినా తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వం లేకపోతే,
ఏదో ఒక విధంగా ఆ ప్రభుత్వాన్ని, ఆ ప్రభుత్వాధినేతను పదవిలోంచి దించే వరకు అమెరికా, ఈయూలు నిద్రపోవు.

అందులోను రష్యాను ఆనుకొని ఉన్న ఉక్రెయిన్ ఈ పాశ్చాత్య దేశాలకు మరింత కీలకమైనది.

సోవియట్ యూనియన్ విడిపోయిన తరువాత అమెరికా, దాని మిత్ర దేశాలు రష్యాను ఆర్థికంగా బాగా చిదిగిపోయేలాగా చేశాయి.

2000 సంవత్సరం తరువాత వ్లాదిమిర్ పుతిన్ అధ్యక్షుడు అయినప్పటి నుండి రష్యా తిరిగి నిలద్రొక్కుకోవడం మొదలుపెట్టి, ఇటీవలి కాలంలో కొన్ని సందర్భాలలో అమెరికాను ధిక్కరించే స్థాయికి ఎదిగింది.

రష్యాకు పూర్వపు వైభవాన్ని తీసుకురావడానికి పుతిన్ ప్రయత్నిస్తున్నారు.

దానితో రష్యాలో కూడా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని ఎగదోసి, పుతిన్‌ని పదవిలోంచి దించడానికి అమెరికా ప్రణాళికలు అమలు చేస్తోంది.

ఆ ప్రణాళిక ప్రకారం రష్యన్ యువతను ఉన్నత ఉద్యోగాలు పేరుతో అమెరికా, ఈయూల చెంతకు చేరదీయడానికి రష్యాకు సరిహద్దు దేశం అయిన ఉక్రెయిన్‌లో తమకు అనుకూలమైన ప్రభుత్వం ఉండితీరాలి.

అందుచేత రష్యాకు అనుకూలంగా ఉన్న యానుకోవిచ్‌ను అమెరికా, ఈయూలు, ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాల ద్వారా పదవిలోంచి దించి, తమకు అనుకూలంగా ఉండే రాజకీయ పక్షాలతో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, తుర్చియనేవ్‌ని అధ్యక్షుడిని చేశాయి.

***తాత్కాలిక ప్రభుత్వం తీసుకున్న తొలి నిర్ణయాలలో ముఖ్యమైనవి ఏమిటంటే,***

దేశవ్యాప్తంగా అన్ని స్థాయిలలోను ఉక్రేనియన్ భాషనే వాడాలి.

ప్రాంతీయ భాషల్లో విద్యా బోధన నిషిద్ధం.

"ఒకే దేశం - ఒకే భాష - ఒకే జాతి" అనేది తాత్కాలిక ప్రభుత్వం యొక్క నినాదంగా మారింది.

ఉక్రెయిన్ జనాభాలో కనీసం సగం మంది రష్యన్ భాషను మాట్లాడతారు. తాత్కాలిక ప్రభుత్వం యొక్క నిర్ణయం, నినాదం సహజంగానే వారి ఉనికికి గొడ్డలిపెట్టుగా మారడంతో, వారు దానిని వ్యతిరేకించడం ప్రారంభించారు.

ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా, 1956లో రష్యా నుండి ఉక్రెయిన్‌కి బదిలీ చేయబడిన క్రిమియా ప్రాంతం స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాంతమే కాకుండా, ఆ ప్రాంతంలోని అత్యధికులు రష్యన్ సంతతికి చెందినవారు.



ఉక్రెయిన్ ప్రభుత్వం తీసుకున్న రష్యన్ వ్యతిరేక నిర్ణయంతో క్రిమియా ప్రాంతంలో భారీ స్థాయిలో నిరసనలు వెల్లువెత్తడంతో, తదనంతర పరిణామాలలో

ఉక్రెయిన్ నుండి విడిపోయి, రష్యాలో చేరడానికి స్థానిక క్రిమియా ప్రభుత్వం 16.3.14 న "ప్రజాభిప్రాయ సేకరణ" జరిపింది. ఈ ప్రజాభిప్రాయంలో 97 శాతం మంది క్రిమియన్లు రష్యాలో చేరడానికి ఓటు వేశారు.

రష్యాలో విలీనం అవడానికి 17.3.14 న క్రిమియా పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించడము, 18.3.14 న రష్యన్ పార్లమెంట్ కూడా ఆ ప్రతిపాదనను అంగీకరించడము, ఆ వెనువెంటనే ఆ ఒప్పందం మీద పుతిన్ సంతకం చేయడము వేగంగా జరిగిపోయాయి.

ఈ విధంగా రష్యాను నిర్వీర్యం చేయడానికి అమెరికా, దాని మిత్రదేశాలు వేసిన ప్రణాళిక బెడిసికొట్టి, చివరకు రష్యాను బలోపేతం చేయడానికే అది ఉపయోగపడింది.

క్రిమియా రష్యాకు అత్యంత కీలకమైన నావికా, సైనిక స్థావరం. అంతే కాకుండా గడ్డకట్టిపోకుండా ఏడాది పొడవునా నౌకాయానానికి అనుకూలంగా ఉన్న తీరం రష్యాకు అదొక్కటే.

అటువంటి కీలకమైన ప్రాంతం ఇప్పుడు పూర్తిగా రష్యా అధీనంలోకి వచ్చింది.

అదే విధంగా తమ స్వార్థపరమైన ప్రయోజనాల కోసం తెలుగు ప్రజల్ని విడదీసిన రాజకీయ శక్తులు చివరకు భంగపాటుకి గురిఅవడమే కాకుండా,

ఈ విభజన అంశం అంతిమంగా తెలుగు ప్రజల యొక్క సమగ్రాభివృద్ధికి, సమైక్యతకే దారితీస్తుంది.

***

# భూమి స్వర్గంగా మారాలి అంటే స్కూళ్ళు, కాలేజీలు, బ్యాంకులు పోవాలి

2.3.14 న మౌంట్ శంబలాలో సాయంత్రం 5 గంటలకు ఇచ్చిన ఉపన్యాసంలో మాస్టరుగారు మాట్లాడుతూ,

※ "ఎప్పుడు స్కూళ్ళు, కాలేజీలు పోతాయో,
ఎప్పుడు బ్యాంకులు పోతాయో,
అప్పుడు భూమి స్వర్గంగా మారుతుంది" అని తెలియజేశారు.

ఇదే విషయాన్ని మాస్టరుగారు గత 20 సంవత్సరాలుగా అనేక సందర్భాలలో అనేక రూపాలలో చాలా స్పష్టంగా చెబుతూనే వస్తున్నారు.

ఈనాడు ఉన్న స్కూళ్ళు, కాలేజీలు, బ్యాంకులు లేకుండా జీవించడానికి మానవజాతి ఎప్పుడు ఇష్టపడుతుందో, అప్పుడు భూమి స్వర్గంగా మారుతుంది అని మాస్టరుగారు పై సందర్భంగా తెలియజేశారు.

※ కానీ ఈనాటి మన ఆధునిక జీవన విధానంలో స్కూళ్ళు, కాలేజీలు మాధ్యమంగా నేర్పబడుతోన్న విద్యావిధానం,
\- బ్యాంకులు, కరెన్సీ ఆధారంగా జరుగుతోన్న ఆర్థిక విధానాలు రోజు రోజుకీ బాగా ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి.

1991 తరువాత మన దేశంలో అమెరికా తరహా ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన తరువాత భారతీయ జీవన స్రవంతిలో ఈ స్కూళ్ళు, బ్యాంకుల యొక్క పాత్ర చాలా వేగంగా పెరుగుతూ వచ్చింది.



***భూమి స్వర్గంగా మారటానికి అడ్డంకిగా ఉన్న స్కూళ్ళు, బ్యాంకులు పోవాలి అంటే,***

ఈనాడు ప్రపంచంలో అమలులో ఉన్న అమెరికా తరహా ఆర్థిక విధానాలు పూర్తిగా పోవాలి.

※ సోవియట్ యూనియన్ కుప్పకూలగానే సామ్యవాద తరహా ఆర్థిక విధానాలు ప్రపంచంలో ప్రాచుర్యాన్ని కోల్పోయినట్లే,
\-- అమెరికా తరహా ఆర్థిక విధానాలు పోవాలి అంటే,
అమెరికా యొక్క ప్రాభవం కూడా కనుమరుగైపోవాలి.

అందుకే 1999 లో మాస్టరుగారు ఇచ్చిన ఇంకొక భవిష్యవాణి గురించి స్వర్ణయుగము మాసపత్రిక చాలా ఆశగా, చాలా ఆతృతగా ఎదురు చూస్తోంది.

***పాఠకులకు చాలా సుపరిచితం అయిన ఆ భవిష్యవాణి ఏమిటంటే,***

అమెరికా, జపాన్ దేశాలు సర్వనాశనం అవుతాయి.

పత్రికను అడ్డం పెట్టుకుని మాట్లాడేకంటే కొన్ని విషయాలను డైరెక్ట్‌గా మాట్లాడటమే బాగుంటుంది ఏమో!

2006 లో స్వర్ణయుగము మాసపత్రికను పునః ప్రారంభించిన తరువాత ప్రస్తుతం 100 వ సంచిక సిద్ధం చేయబడుతూ ఉంది కాబట్టి, ఈ ప్రత్యేక సందర్భంగా కొన్ని విషయాలను పాఠకులతో డైరెక్ట్‌గానే పంచుకోదల్చుకున్నాను.

జార్జ్ బుష్ అమెరికాకు అధ్యక్షుడిగా ఉన్నప్పుడు బిన్ లాడెన్‌ను పట్టుకోవడానికి అతను ఎంతగా ప్రయత్నించిందీ పాఠకులకు తెలిసిందే.

అప్పట్లో నా మిసెస్ మంగతాయారు ఏం అనేది అంటే, "మీ మనస్సులో ఏం ఉందో తెలిస్తే, బిన్ లాడెన్‌ని కాదు, మిమ్మల్ని జార్జ్ బుష్ హిట్ లిస్ట్‌లో పెట్టుకుంటాడు" అనేది.

2005 లో కత్రినా మొదలైన రెండు మూడు హరికేన్లు అమెరికాను అతలాకుతలం చేసినప్పుడు "ఈనాడు" దినపత్రికలో ఒక కార్టూన్ పడింది.

దానిలో బిన్ లాడెన్ ఏమంటాడు అంటే, "అమెరికాను మనం ఏమీ చేయక్కర్లేదు. ఆ హరికేన్లే దానిని నాశనం చేసేస్తున్నాయిలే!" అంటాడు.

అమెరికా యొక్క ప్రాభవాన్ని తగ్గించే ప్రతీ సంఘటన కోసం నేను అదే విధంగా ఎదురు చూస్తూవుంటాను.

కానీ నాకు అమెరికా అంటే ఏ మాత్రమూ వ్యక్తిగత ద్వేషం లేదు.

అమెరికా యొక్క స్వేచ్ఛా సమాజం అంటే నాకు చాలా ఇష్టం కూడా.

మాస్టరుగారి మరదలు (తమ్ముడి భార్య) శ్రీమతి విజయా విశ్వనాథ్ ఒకసారి అన్నారు కూడా, "మీరు, మాస్టరుగారు ఏ అమెరికాలోనో, ఆస్ట్రేలియా లోనో పుట్టి ఉండాల్సింది. పొరపాటున ఇండియాలో పుట్టారు" అని.

ఒక వైపు భారతీయ ఆధ్యాత్మికత గురించి మాట్లాడుతూ, రెండవ వైపు పూజలు, యజ్ఞాలు మొదలైన కర్మకాండలకి దూరంగా ఉంటాము అనే ఉద్దేశ్యం తో ఆవిడ ఆ విధంగా అన్నారుకాని,

మానవ సమాజం గురించి నా యొక్క భావనలు, ఆలోచనల్ని అమెరికన్ సమాజమే బాగా ఆదరించివుండేదేమో!

ఆదర్శాలను ఆదరించే అమెరికన్ సమాజం వెనుక ఒక భయంకరమైన కార్పోరేట్ ముఠా ఉంది. ఈ ముఠా తమ యొక్క వ్యాపార ప్రయోజనాల కోసం ప్రపంచం మొత్తాన్ని భౌతికవాదంలో ముంచేయడమే కాకుండా,

తమకు అడ్డు వచ్చే వ్యక్తుల్ని, ప్రభుత్వాల్ని సర్వనాశనం చేసేస్తోంది.

అమెరికన్ కార్పోరేట్ ప్రపంచం చేస్తోన్న దురాగతాలు గురించి జాన్



పెర్కిన్స్ అనే ఒక మాజీ అమెరికన్ ఏజెంట్ "కన్ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్ మేన్" అనే పుస్తకంలో చాలా విపులంగా వివరించారు.

"ఒక దళారి పశ్చాత్తాపం" అనే పేరుతో తెలుగులో ప్రచురింపబడిన ఆ పుస్తకం నుండి కొన్ని వ్యాసాలను గతంలో స్వర్ణయుగము మాసపత్రికలో ప్రచురించడం కూడా జరిగింది.

ఈనాటి అమెరికా తరహా ఆర్థిక విధానాలు, ఆ ఆర్థిక విధానాలకు సేవలు అందించే వ్యక్తుల్ని తయారుచేసే విద్యా విధానం ఈ రెండూ కూడా మనిషిలో స్వార్థాన్నే పెంచిపోషిస్తున్నాయి.

ఇంకొక వైపు ప్రకృతిని కూడా ధ్వంసం చేస్తున్నాయి.

వాతావరణం కాలుష్యమయం అవుతూ,
మనిషి స్వార్థపరుడు అవుతూ ఉంటే,
భూమి స్వర్గంగా ఏ విధంగా మారుతుంది?

భారతీయ ఆధ్యాత్మికత ఆధారంగా భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారు ప్రపంచానికి నేతృత్వం వహించినప్పుడు మాత్రమే మానవ సమాజం సవ్యమైన దిశలో ప్రయాణించి, తద్వారా భూమి స్వర్గంగా మారుతుంది.

ప్రపంచానికి అమెరికా నేతృత్వం వహించినంత కాలం మానవ సమాజం లో ఈ భౌతికవాదము, స్వార్థము తొలగిపోవు.

అందుచేత మాస్టరుగారు చెప్పినట్లుగా అమెరికా యొక్క ప్రాభవం నశించే సంఘటనల కోసం చాలా ఆశగా ఎదురుచూస్తూ ఉండటమే కాకుండా, ఏ ముఖ్యమైన సంఘటన జరిగినా, దానిని పాఠకులతో పంచుకోవడం జరుగు తోంది.

***

# సిరియా విషయంలో కూడా అమెరికాకు భంగపాటు తప్పలేదు

గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ అమెరికా వెళ్ళడానికి వీలు లేకుండా గత 12 సంవత్సరాలుగా అమెరికా ప్రభుత్వం ఆయనకు వీసాను నిరాకరిస్తూ వస్తోంది.

కానీ రాబోయే ఎన్నికలలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అయ్యే అవకాశం ఉండడంతో ఇటీవల అమెరికా రాయబారి నాన్సీ పావెల్ స్వయంగా వెళ్ళి ఆయన్ని కలిశారు.

అమెరికా యొక్క అవకాశవాదం ఈ విధంగా ఉంటుంది.

గత సంవత్సరం డిశంబరులో మరణించిన నెల్సన్ మండేలా యొక్క అంత్యక్రియలకు ప్రస్తుత అధ్యక్షుడు బరాక్ ఒబామాతో పాటు, మాజీ అధ్యక్షులు జార్జ్ బుష్, బిల్ క్లింటన్ కూడా హాజరయ్యారు.

ఆహా! దక్షిణాఫ్రికా గాంధీగా పేరు పొందిన నెల్సన్ మండేలా అంటే అమెరికాకు ఎంత గౌరవమో, ఎంత ఆప్యాయతో అనిపిస్తోంది కదూ!

- అదే నెల్సన్ మండేలాను 2008 వరకు అమెరికా ఉగ్రవాదుల జాబితాలో ఉంచింది. అమెరికా యొక్క ద్వంద్వ నీతికి తార్కాణం ఇది.

2003 లో నెల్సన్ మండేలా అమెరికా గురించి మాట్లాడుతూ, "చెప్పనలవికాని దురాగతాలకు పాల్పడిన దేశం ప్రపంచంలో ఏదైనా ఉంది అంటే, అది అమెరికాయే" అని పేర్కొన్నారు.



ఆధునిక మారణాయుధాలతో ప్రపంచం మొత్తాన్ని ఆక్రమించిన యురోపియన్ దేశాల ప్రజలతో 1776 లో స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన అమెరికా, ఆ యురోపియన్ దేశాల పరంపరనే ఇప్పటికీ అనుసరిస్తోంది.

**ఎటొచ్చి తేడా ఏమిటంటే,**

యురోపియన్ దేశాలు డైరెక్ట్‌గా ప్రపంచాన్ని ఆక్రమించాయి.
అమెరికా ఇన్ డైరెక్ట్‌గా ప్రపంచాన్ని శాసిస్తోంది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచం మీద యురోపియన్ దేశాల యొక్క ఆధిపత్యం తొలగిపోవడం ప్రారంభమై,

అమెరికా, సోవియట్ యూనియన్‌లు అగ్రరాజ్యాలుగా అవతరించాయి.

అప్పటి వరకు ప్రపంచాధిపత్యం కోసం బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, పోర్చుగల్ వంటి యురోపియన్ దేశాలు పోటీ పడితే,

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య ఆ పోటీ ప్రారంభం అయింది.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం అయిన తరువాత అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా అవతరించి, ప్రపంచం మీద తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకుంది.

ఆధునిక ప్రపంచ గమనానికి ఆధారమైన ఇంధన వనరులు ఎక్కువగా ఈ రెండు అగ్రరాజ్యాల యొక్క పలుకుబడిలోనే ఉండేవి.

ఇరాన్, ఇరాక్, సిరియాలు మినహా మధ్య ప్రాచ్య ఇంధన వనరులు అన్నీ అమెరికా పలుకుబడి క్రింద ఉంటే,

సిరియా నుండి అజర్‌బైజాన్‌లోని బాకూ వరకూ ఉన్న ప్రాంతం అంతా సోవియట్ యూనియన్ పలుకుబడిలో ఉండేది.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత అమెరికా యొక్క కన్ను తన అధిపత్యంలో లేని ఇంధన ప్రాంతాల మీద పడింది.

ముఖ్యంగా 9/11 ఉగ్రవాదుల దాడి అనంతరం అందుకు ఒక ప్రణాళిక ను కూడా అమెరికా సిద్ధం చేసింది.

ఈ వివరాలను 31.5.13 న సాక్షి దినపత్రికలో వెలువడిన వ్యాసంలో శ్రీ పిళ్ళా వెంకటేశ్వరరావు ఈ క్రింది విధంగా తెలియజేశారు.

(ప్రారంభం ......)

❋ "మనం ఇరాక్‌తో ప్రారంభించి ఐదేళ్లలో సిరియా, లెబనాన్, లిబియా, సోమాలియా, సూడాన్, ఇరాన్‌లను స్వాధీనం చేసుకోవాలి"
అనే ఆ పథకం గత ఏడాది రచ్చకెక్కింది.

నాటి అమెరికా రక్షణమంత్రి డోనాల్డ్ రమ్స్ ఫీల్డ్ ఆ విషయాన్ని వెల్లడించినట్టు 'గార్డియన్' పత్రిక 2012 జూలై 3 న తెలియజేసింది.

కానీ ఇరాక్ యుద్ధంలో అమెరికాకు చావు తప్పి కన్నులొట్టపోయింది.
అఫ్ఘాన్ ఊబి నుండి అది ఇంకా బయటపడలేదు.


పైగా రష్యాను తక్కువగా అంచనా వేసి,
మరో ప్రత్యర్థి చైనాను విస్మరించింది.

❋ ఈ విధంగా రమ్స్ ఫీల్డ్ పథకం భగ్న స్వప్నం అయింది.

శ్రీ అరబ్బు ప్రజాస్వామిక విప్లవంలో అమెరికా ఆ భగ్న స్వప్నాన్ని నిజం చేసుకునే అవకాశాలను చూసింది.

-- అరబ్బు విప్లవాలను హైజాక్ చేసి,
ఈజిప్టు, యెమెన్, జోర్డాన్, లిబియాలలో 'మిత్ర ప్రభుత్వాలు' పేరుతో






ఇస్లామిక్ మత ఛాందసవాదులను అధికారంలోకి తెచ్చింది.

❋ సిరియా ప్రజాస్వామిక ఉద్యమాన్ని హైజాక్ చేసి,
'మిత్ర ప్రభుత్వాన్ని' ఏర్పాటు చేసే ప్రయత్నంలో
ఆ దేశాన్ని నిత్యాగ్ని గుండంగా మార్చింది.

సిరియా సమస్యను విప్పరాని చిక్కుముడిగా మార్చింది.

తాజాగా అమెరికా, సిరియా అధ్యక్షుడు అసద్ రసాయనిక అస్త్ర ఎర్రగీత దాటాడు అంటూ వీరంగమేసి, చివరకు చతికిలబడింది.

(......ముగింపు)

ఉక్రెయిన్ విషయంలో లాగానే, సిరియా విషయంలో కూడా అమెరికాకు భంగపాటు తప్పలేదు.

31.10.13 న "సాక్షి" దినపత్రికలో వెలువడిన శ్రీ పిళ్ళా వేంకటేశ్వరరావు గారి వ్యాసం నుండి ఆ వివరాలను ఈ దిగువన పరిశీలిద్దాం.

(ప్రారంభం.........)

కట్టుకున్నోడు కొట్టాడు, అత్త కొట్టింది, ఆడబిడ్డ కొట్టింది, నేనూ నాలుగు తగిలించిపోతే పోలా... అని దారినపోయే దానయ్య కూడా కొట్టి పోయాడట వెనుకటికో ఇల్లాలిని.

అలా తయారైంది అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా పరిస్థితి.

లేకపోతే అమెరికా సైన్యం అండ లేనిదే బ్రతికిబట్టగట్టలేని రాచరిక సౌదీ అరేబియా, భద్రతా మండలి సభ్యత్వాన్ని గెలుచుకున్న వెంటనే తిరస్కరించేదా? ఈ నెల 18న దౌత్య ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేయగలిగేదా?

సిరియా అంతర్యుద్ధంలాంటి అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించడంలో ఐక్యరాజ్య సమితి వైఫల్యానికి నిరసనగానే సౌదీ అరేబియా ఈ అసాధారణ చర్యకు పాల్పడింది అనేది పైకి చెప్పే సాకు.

✷ నిజానికి అది అమెరికాపై ఆగ్రహ ప్రకటన.


-- సౌదీ అరేబియాకి కాబోయే అమీర్‌గా భావిస్తున్న ప్రిన్స్ బందర్ బిన్ సుల్తాన్ ('బందర్ బుష్') "ఇది ఐక్యరాజ్య సమితికి పంపుతున్న సందేశం కాదు, అమెరికాకు పంపుతున్న సందేశం" అని స్పష్టం చేశారు.

రసాయనిక ఆయుధాల నిర్మూలన పేరిట సిరియాపై సైనిక చర్యతో బషర్ అల్ అసద్ ప్రభుత్వాన్ని కూల్చడానికి సర్వం సిద్ధం చేసుకొని కూడా అమెరికా వెనుకడుగు వేయడమే సౌదీ అరేబియా ఆగ్రహానికి కారణం.

✷ మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రాబల్యానికి మూలస్తంభాల్లో ఒకటిగా, చిరకాల మిత్రదేశంగా ఉన్న తమను
అమెరికా ఒంటరిని చేసింది అని సౌదీ అరేబియా భావిస్తోంది.



సెప్టెంబర్‌లో అతి నాటకీయంగా రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్, ఇంద్ర జాలికుడు టోపీలోంచి పావురాన్ని తీసి నట్టు సిరియా రసాయనిక ఆయుధా లను నిర్వీర్యం చేసే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు.



అంతే ఠక్కున ఒబామా సైనిక చర్యను విరమించి, మధ్యప్రాచ్యంలోని చిరకాల సన్నిహిత మిత్రులను అమెరికా దూరం చేసుకోవాల్సి వచ్చింది.

నమ్మశక్యం కానివిగా కనిపించే ఈ పరిణామాల తదుపరి మధ్యప్రాచ్య రాజకీయాలలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి.

**'సిరియా' మలుపు -- పుతిన్ గెలుపు**

సెప్టెంబర్‌లో సిరియాపైకి అమెరికా ఐదు డిస్ట్రాయర్ యుద్ధ నౌకలను ఎక్కుబెడితే, దానికి ప్రతిగా రష్యా తన క్షిపణి విధ్వంసక 'మాస్కో' క్రూయిజర్ సహా పదకొండు యుద్ధ నౌకలను రంగంలోకి దించింది.

వాటికి తోడు చైనా యుద్ధ నౌకలు కూడా నిలిచాయి.

సిరియాపై దాడికి బదులు చెప్పడానికి సిద్ధమయ్యాయి.

1962 నాటి 'క్యూబా మిస్సయిల్ సంక్షోభం'తో సరితూగక పోయినా ఆ తదుపరి ప్రపంచం ఇలాంటి ఉద్రిక్త పరిస్థితిని ఎరుగదు.

"గుర్తు తెలియని వారు" సిరియాపై రెండు క్షిపణులను ప్రయోగించగా అవి గురి తప్పినట్టు వార్తలు వచ్చాయి.

ఆ "గుర్తు తెలియని" క్షిపణులు స్పెయిన్‌లోని నాటో సైనిక శిబిరం నుంచి ప్రయోగించిన అమెరికా తయారీ టామ్ హాక్ క్షిపణులు అనేది ఇప్పుడు బహిరంగ రహస్యం.

ఇక వాటిని రష్యా నిర్వీర్యం చేసిన తీరుపై భిన్న కథనాలు ఉన్నా, గల్ఫ్ దేశాల మీడియా అది రష్యా పనేనని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తోంది.

ఇంతకూ ఒబామా ఎందుకు వెనుకడుగు వేశారు?

లిబియా విషయంలో రష్యా చివరి నిమిషంలో వెనక్కు తగ్గింది. అలాగే సిరియాపై కూడా అది వెనక్కు తగ్గక తప్పదని ఒబామా ప్రభుత్వం భావించింది.

ప్రపంచ మీడియా పండితులు అంతా దానికి వంత పాడారు.

శ్రీ అయితే ఒక్క విషయాన్ని మరిచారు.
నాటి రష్యాకు వెన్నెముకలేని మెద్వదేవ్ అధ్యక్షుడు కాగా,
నేటి అధ్యక్షుడు పుతిన్!

-- పదమూడేళ్లుగా పుతిన్ రష్యా పూర్వప్రాభవాన్ని సంపాదించడానికి చేస్తున్న కృషినంతటినీ, సిరియాలో సమాధి చేసుకోడానికి ఆయన సిద్ధపడలేదు.

సిరియాపై సైనిక చర్యను సహించడం అంటే, ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా ఇరాన్‌పై దాడికి దిగడానికి అనుమతించడమేనని పుతిన్‌కు బాగా తెలుసు. అందుకే తాడో పేడో తేల్చుకోడానికి సిద్ధపడ్డారు.

70 శాతం అమెరికన్లేగాక, జర్మనీవంటి కీలకమైన యూరోపియన్ దేశాలు సైతం వ్యతిరేకిస్తుండగా సుదీర్ఘ యుద్ధానికి ఒబామా సిద్ధంగా లేరు.

అయినా రష్యా వెనక్కు తగ్గుతుంది అన్న ధీమాతో ఆయన సర్వం ఒడ్డి జూదమాడారు.



శ్రీ ఆయన అంచనాలు తప్పడంతో మధ్యప్రాచ్యంపై అమెరికా ఆధిపత్యాన్ని, ఆధిక్యతను, అద్వితీయ స్థానాన్ని పోగొట్టుకోవాల్సి వచ్చింది.

-- నమ్మకమైన మిత్రులనుకున్న అందరినీ దూరం చేసుకోవాల్సి వస్తోంది.

✳ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా ఒబామా రష్యా, చైనాలతో తలపడాల్సి వచ్చేసరికి తోక ముడిచారు.

-- పరువు దక్కించుకోడానికి
రష్యా "హామీ మేరకు" సైనిక చర్యను విరమించారు.

## నమ్మక ద్రోహం

హడావిడిగా ఇరాన్ నూతన అధ్యక్షుడు హస్సన్ రుహానీతో ఒబామా మొట్టమొదటిసారిగా ఫోన్‌లో సంభాషించారు.

దీనితో రష్యా ప్రతిపాదనకు అసద్ తల ఊపారు. అమెరికా కనుసన్నల్లోని 'ఫ్రీ సిరియన్ ఆర్మీ' ఠక్కున అసద్‌తో శాంతి చర్చలకు అంగీకరించింది.

సిరియాపై జెనీవాలో శాంతి చర్చలకు తెరలేచింది.
ఇరాన్‌తో అణు చర్చలకు కూడా హఠాత్తుగా దారి తెరచుకుంది.

✳ చకచకా జరిగిపోయిన ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలోని అమెరికా నమ్మకమైన మిత్రులంతా ఖంగుతిన్నారు.

ఇరాన్, అమెరికాల మధ్య సయోధ్య కుదిరితే దానిపై ఆంక్షల ఎత్తివేత తథ్యం. అదే జరిగితే ప్రాంతీయ శక్తిగా ఇరాన్ సౌదీ అరేబియాకే కాకుండా, ఇజ్రాయెల్‌కు కూడా గట్టి పోటీదారు అవుతుంది.

✳ సిరియా, ఇరాన్ యుద్ధాలపై ఆ రెండు దేశాలు చాలా ఆశలు పెట్టుకున్నాయి.

సౌదీ అరేబియా, ఖతార్ దేశాలు సిరియాలోని అల్‌కాయిదా అనుబంధ ఉగ్రవాద మూకలకు అపారంగా నిధులను సమకూర్చాయి.

- అమెరికా వైఖరిని సౌదీతో పాటూ దాని నేతృత్వంలోని గల్ఫ్ సహకార మండలి దేశాలన్నీ నమ్మకద్రోహంగా పరిగణిస్తున్నాయి.

-- భద్రతారాహిత్యానికి గురవుతున్నాయి.

జూలైలో రష్యాతో రహస్య ఆయుధాల ఒప్పందం కోసం ప్రయత్నించిన బందర్ బుష్ నేడు తిరిగి రష్యా వైపు చూస్తున్నారు.

ఇజ్రాయెల్ ఒంటరిగానైనా ఇరాన్ అణు కర్మాగారాలపై దాడులు చేసే విషయాన్ని పరిశీలిస్తోంది.

ఇది ఇలా ఉండగా అరబ్బు దేశాలకు 'ఆదర్శ నమూనా'గా అమెరికా కీర్తించే టర్కీ కూడా ఒబామాపై ఆగ్రహంతో ఉంది.

సిరియాలో అసద్ పాలనను అంతం చేయడానికి పట్టుబట్టిన టర్కీ ప్రధాని రెసెప్ తెయ్యిప్ ఎర్డోగాన్ అమెరికా నూతన వైఖరితో తమ దేశ భద్రత పట్ల ఆందోళన చెందుతున్నారు.

సహజంగానే ఇరాన్... రష్యా, చైనాలతో సత్సంబంధాల ద్వారా సిరియా నుంచి ముప్పును నివారించుకోవాలని ప్రయత్నిస్తోంది.

నాటోలోని ఏకైక ముస్లిం మెజారిటీ దేశమైన టర్కీ నేడు నాటోయేతర క్షిపణి రక్షణ వ్యవస్థలపై ఆధారపడటం అవసరమని భావిస్తోంది.

ఈయూలో చేరుతానని ఊరిస్తున్న ఎర్డోగాన్ యూరోపియన్ కంపెనీలను కాదని, క్షిపణి రక్షణ వ్యవస్థల కోసం (ఎఫ్‌డీ-200) 300 కోట్ల డాలర్ల కాంట్రాక్టును చైనాకు కట్టబెట్టారు. పైగా ఇరాన్‌కు ఆయుధాలను సరఫరా చేస్తున్నందుకుగానూ



అమెరికా ఆంక్షలకు గురైన చైనా కంపెనీ, సీపీఎమ్ఐఈసీతో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

మరోవంక ఈ నెల మొదటి వారంలో ఎర్డోగాన్ ప్రభుత్వం ఇరాన్‌తో సత్సంబంధాలకు పటిష్ఠమైన 'వారథి'ని నిర్మించింది.

ఇజ్రాయెల్ తరపున గూఢచారులుగా పనిచేస్తున్న పది మంది ఇరానీయుల జాబితాను ఇరాన్‌కు అందజేసింది. దీనితో అమెరికా టర్కీకి తమ పేట్రియాట్ క్షిపణుల సరఫరాను నిలిపివేసింది అనేది వేరే సంగతి.

- అమెరికా గూటి చిలుక అనుకున్న ఎర్డోగాన్ రెక్కలు గట్టుకొని కొత్త మిత్రులను అన్వేషించుకుంటున్నారు.

సిరియా సమస్యపై ఒబామాకు 'నాకింగ్ పంచ్'ను రుచి చూపించిన పుతిన్ అదే ఉత్సాహంతో అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బ మీద దెబ్బ తీస్తున్నారు.

మధ్య ఆసియా ప్రాంతంలోని తమ ఏకైక సైనిక స్థావరాన్ని అమెరికా ఎత్తివేయక తప్పడం లేదు. పుతిన్ మంత్రాంగంతో క్రిజిగిస్థాన్ ప్రభుత్వం అమెరికా సైనిక స్థావరం కొనసాగింపునకు అంగీకరించలేదు.

- ఇరాక్ యుద్ధంతో మధ్య ప్రాచ్యపు రాజకీయ పటాన్ని తిరిగి వ్రాయాలని అమెరికా భావించింది.

-- ఆ ఆశలన్నిటినీ సిరియాలో సమాధి చేసుకొని,
అమెరికా తన తలరాతను తానే తిరిగి వ్రాసుకోవాల్సి వస్తోంది.

ఇది అంతా రష్యా తిరిగి బలీయమైన శక్తిగా ఆవిర్భవించిన ఫలితమో, చైనా అగ్రరాజ్యంగా మారిన ఫలితమో కాదు.

అమెరికా 'సామ్రాజ్య' ప్రాభవం అస్తమిస్తున్న సూచన.